# పరకీయం

వేసవి చేరుకున్న రెండోనాటికే ఫర్నిచర్ ఏర్పాట్లకు మరో "యూనిట్" అంతా 'హార్స్లీ' చేరుకుంది. వస్తూనే బలరాం ప్రకటించాడు-గవర్నరుగారు వారంరోజుల్లో వస్తున్నారని.

అక్కడితో సిబ్బంది హడావుడి ఎక్కువైంది. అంతవరకు హుషారుపడుతున్న ఎలక్ట్రిషియన్ హుస్సేన్ జీపు తీసుకొని మదనపల్లెకు పరిగెత్తాడు సామాన్లు తెచ్చుకొందుకు. సిబ్బంది అంతా ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నులయ్యారు.

సరిగ్గా 16 మైళ్ళ ప్రయాణం మదనపల్లెనుంచి హార్స్లీకి. పొడవుగా వెన్నెల చారలా వుండే రోడ్డుమీద సంజె వెలుగులో నిలబడి చూస్తే, ఇంకా నలుపు వీడని ఆకాశం మధ్య ఎర్రటి కెంపురంగు బొట్టులాగ కనిపిస్తుంది, హార్స్లీకొండ ప్రక్కనే పల్లాలకి పాకే చెట్లూ చెదురుగా పోకచెట్లూ మధ్యమధ్య పేరులేని పిచ్చిపూలమొక్కలూ, ఇవన్నీ చూశాక గవర్నరు గారికి యిక్కడెంత విశ్రాంతి లభిస్తుందో అర్థమైంది.

డబ్బుకూ సుఖానికీలంకె, బీదవాడికిమనసులోనూ, ధనవంతుడికి రూపాయిలోనూ విశ్రాంతి లభిస్తుంది.

బంగళామీదకి ఎక్కి రామారావు అరుస్తున్నాడు తాళ్ళు విసరమని, రెండుజీపుల్లో లేబర్ని ఎక్కడినుంచో లాక్కొచ్చాడు బలరాం. ఆప్రదేశమంతా పెద్దజాతర జరుగుతున్న

కథా నిలయం
842



స్తుంది. జోషులో మేకు దిగితే, ఆ పనికే అక్కడికి వచ్చినంత శ్రద్ధగా కూచొని బాగు చేస్తున్నాడు నాగభూషణం.

"మనకి క్వార్టర్లు ఎక్కడిస్తున్నారు నాగభూషణం" అంటే దృష్టి మరల్చలేదు.

"మన మింకా మనుషులమని ఇక్కడివాళ్లు గుర్తించలేదు. అది జరిగాక ఏదో శిథిలాలను ఏర్పాటు చేస్తారు" అన్నాడు.

బలరాం వచ్చాడు, సిగరెట్టు వెలిగిస్తూ, "మీ ప్రయత్నాలు ఎంతవరకు వచ్చాయో కనుక్కోమన్నారు సూపర్‌వైజర్"

వరుసగా ఏకరువు పెట్టాను: "బంగాళాదుంపలు 25 వీశెలు మాత్రం అయిదో తారీకు నాటికి వస్తాయి. ఉల్లిపాయలకు ఫరవాలేదు. ఇంక నిమ్మకాయలు దొరకలేదు. వాయల్పాడుకు ఓ జీపు, పరకాల కుప్పంకు ఓ జీపు పంపాను. రేపటికి సమాచారం తెలుస్తుంది. భోజనమంతా పాతపద్ధతా? లేక సూప్ గట్రా ఉండాలా ?".

"పెద్దవాళ్ళు అసలేవీ తినరండి. నాగరికతను టేబిలుమీద పరుచుకొని, కాస్తపాటి మాటల్ని చప్పరించి, ఆకలిని సంస్కారంతో సరిపెట్టుకొంటారు" అంటున్నాడు నాగభూషణం.

♦ ♦ ♦

గవర్నరుగారి వేసవి విడిది ఏర్పాటుకి దాదాపు 40 మంది సిబ్బంది పది రోజులు ముందుగానే హార్స్లీ కొండకి చేరు

కొన్నాం. నేనెప్పుడూ అక్కడికి రాలేదు. అక్కడ పూర్తిగా నేలకి వెలుగు తాకకుండా ఆపేచెట్లూ, మెలికలు తిరిగే బాటలూ, ఏవో పేరు తెలీని పిట్టల అరుపులూ-యింకా పూర్తికాని ఊహాచిత్రంలాగ ఉంది హార్స్లీ.

వచ్చిన అయిదు రోజుల వరకూ డేరాలు వేసుకు గడిపాం. ఎక్కడో టిబెట్టులో ఉన్నటనిపించింది. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పురుషోత్తం నాయుడుగారు వస్తూనే క్వార్టర్లు ఏర్పాటు చేశారు. బంగళాకు సరిగా రెండు ఫర్లాంగుల దూరం. హార్స్లీకొండకు కుడివేపు పల్లాలలో క్రిందికి జారుతున్న తెల్లటిరాళ్లు పేర్చినట్టు వరసగా యిళ్ళు. ఎదురుగా మరి రెండు పెద్దయిళ్ళు. అక్కణ్నుంచి కిందకి విశాలంగా పరుచుకొన్న ఊరూ, దూరాన నారింజతోటలూ, చెరుకు గట్లూ- అంతా త్రివర్ణ చిత్రంలాగ అవుపిస్తోంది.

వచ్చిన అయిదు రోజుల్లో నేను సగం పనయినా చేయక పోవడం గమనించి బలరాం విసుక్కొన్నాడు. "ఈ విడిది గవర్నరు గారికోయ్, మనకికాదు. ప్రపంచాన్ని చూచి, కలలు కని పొరపాటున చాలామంది రచయితలై పోయారు. రచయితవి అయినావా చావు మూడిందే! అంచేత నారింజ తోటలవైపు ఓ తడికె కట్టించు" అన్నాడు.

నిజమే. ఆ ప్రకృతి చిత్రాన్ని చూస్తుంటే మనసులో ఏదో అపూర్వమైన శక్తంతా ఖర్చయి పోతున్నట్టూ, కొన్నాళ్ళ యాక నాలో ఏమీ మిగలక _ ఆ దృశ్యం మీద పచ్చి అభిమానం మిగలబోయేటట్టూ అనిపించింది ..........

మా యిళ్ళముందు జడలు విప్పుకొన్న పెద్ద మర్రిచెట్టు, మధ్యలో ఓ జెండా ఎగురవేసేదిమ్మ, కుడివేపు మూలగా పాతకాలపు లాంతరు స్థంభం. ఎలక్ట్రిక్ దీపాలు వచ్చినా ఆ ప్రాంతంలో అమరినట్టు ఉండడంవల్ల దాన్నెవరూ తొలగించి నట్టులేదు. చీకటి పడ్డాక ఎలక్ట్రిక్ దీపాలు వెలిగినా ఆ స్థంభంలో ఎవరో దీపం తీసుకవచ్చి ఉంచుతారు. దేవుని ముందు తలవొంచుకుని నిలబడ్డ భక్తుడిలాగ ఎలక్ట్రిక్ దీపపు నీడలో లాంతరు స్థంభం కనిపిస్తుంది.

ఎదురుగ్గా చీకటికి వ్యుత్పత్తి చెపుకున్నట్లు మర్రి చెట్టుఆకుల వొరిపిడి రాత్రి నిశ్శబ్దానికి లయవేస్తున్నట్టు-ఉండుండి పక్షుల రెపరెపలూ అంతా అదో విచిత్రమయిన వాతావరణం.

ఆ వరుసలో చివరిఇల్లు వుంది. గోడలు కాస్త వాలినట్టు కిటికీనుంచి క్రిందికి చూస్తే లోయల్లోకి పడిపోతున్నట్లు అనుభూతి కలుగుతుంది. లోయల్లో బండపడి నీలిరంగుగామెరిసి, చెట్లని పట్టుకు పచార్లు చేస్తున్నట్టు కనిపిస్తుంది. ఒంటరిగా ఉండాలంటే మొదట భయంవేసేది. బలరాం ఎదుటివరుసలో చివరి ఇల్లు తీసుకున్నాడు.

ఓరోజు ఆలశ్యంగా, ఇంటికివస్తే టేబిలుమీదవున్న గడియారాన్ని చెవిదగ్గర పెట్టుకు చూస్తున్నాయి కోతులు. నేను రాగానే బుద్ధిగా గడియారాన్ని నేలమీద ఉంచి దానిమీద కూర్చున్నాయి- అది వాటి ఆస్తే అయినట్టూ నేను దాన్ని

ఎత్తుకపోవడానికి వచ్చినట్టూ నన్ను దొంగనిలాగా చూస్తు న్నాయి.

మర్నాడు బలరాంతో చెప్పాను, యిల్లు నాకేం నచ్చ లేదని. "ఇప్పటికింతే, భార్యను రప్పించు, నా కుటుంబంకూడా రెండ్రోజులలో వచ్చేస్తుంది. తోడుగా ఉంటారు" అన్నాడు. అదే మంచిదనిపించింది. వెంటనే టెలిగ్రాం యిచ్చి వచ్చాను.

సామానులు పాడుచేయకుండా రోజూ కోతులకి బిస్కట్లు తీసుకురావడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికి నా మీద సానుభూతి చూపడం ప్రారంభించాయి. నా వస్తు వులమీద ఆసక్తిచూపకుండా బిస్కట్లకోసం టేబిలంతా వెదికి పోవడం సాగించాయి.

మూడోరోజు ఉదయమే లేచేసరికి బలరాం ఇంటి ముందు బండి ఆగివుంది. ఎవరో వచ్చారుకాబోలనుకున్నాను. తీరాచూస్తే ఎర్రటి చీరె—గుర్తు తెలిసింది. భార్యవచ్చింది కాబోలు.

ఆఫీసులో గుర్తుచేశాడు బలరాం. "భార్యకు ఉత్తరం రాశావా? — మావాళ్లు వచ్చేశారు. తోడుగా ఎవరూ లేక పోతే ఆ మూల ఒంటరిగా గడవటం కష్టం."

"రాశాను" అన్నాను.

బంగళాగోడలకి ఎర్రరంగు సరిగా కుదరక తన్నుకొంటు న్నాడు నాగభూషణం. మరి ఇద్దరు కంట్రాక్టర్లని లాక్కొ చ్చారు. హాల్లో రెండు టీపాయిలూ, ముందు విజిటర్స

రూమూ, రెండు పెడిరాజూవీ, ఒక పికాసో పెయింటింగ్, క్యూబిజమ్ పిక్చర్ అమర్చేపని నాకప్పగించాడు బలరాం. పికాసో చిత్రం చూశాను. నడుందగ్గర రొమ్ములు ప్రారంభ మయి, మెడ ఏదో తెలీకుండా, ముఖం మరేదో జంతువుది లాగవుంది పెయింటింగ్. ప్రక్కనే రెండు ఆకుల్లేని కొమ్మలు దాన్ని ఆనుకుని ఉన్నంతెగా ఏదో ఆకారంగల పక్షి దీని అర్థం ఏమిటో ? ఇది గవర్నరుగారి రూములో ఎందుకుండాలో అర్థం కాదు. బహుశా ఇది గవర్నరుగారి అభిరుచికాదేమో ? — ఆ మాటకు వస్తే "అభిరుచి"కి అర్థంలేదు. సంస్కారం "ప్రశంస"ను కొనుక్కునేందుకు ఇచ్చే ఖరీదు "అభిరుచి". ఇంకా చెప్పాలంటే అవధిలేకుండా కట్లు తెంచుకొనే ఉద్రేకా లకు విజ్ఞత పెట్టుకున్న పేరు "అభిరుచి". ఆ విధంగా హత్య చెయ్యడం ఒకరి అభిరుచి అయితే వెన్నెట్లో తియ్యదనాన్ని అనుభవించడం మరొకరి అభిరుచి అవుతుంది.

ఎంత ప్రయత్నించినా ఆ పెయింటింగ్ మీద నాకు సదభిప్రాయం కలగలేదు. ఓ మూల దాన్ని యేర్పాటు చేశాను.

చీకటిపడ్డాక ఇల్లు చేరాను. ఓ కుర్రాడు గదిలోకి వచ్చాడు. పొడవు మేజోళ్ళు, బ్రేస్‌లెట్స్ ఉన్న ఆకుపచ్చ రంగుపాంటు, దాదాపు అయిదేళ్ళుంటాయి, తలమీద రంగు రంగులటోపీ, ఏదో తింటున్నాడు.

"ఏం ?" అన్నాను.

"పుస్తకం"

నాకేం అర్థం కాలేదు. "ఎందుకూ!"

ఎట్లా చెప్పడమో తెలీక మొదట తెల్లబోయాడు. బయటికివచ్చి కాస్సేపు వసారాలో నిలబడిపోయాడు. అంతలో మళ్ళీ నన్ను పిలిచి యెదురింటివేపు చూపాడు. కాస్త వెలుగులో అక్కడ యెర్రటిచీరె గుర్తు తెలిసింది. బహుశా బలరాం భార్య అయివుంటుంది. ఇటువేపే చూస్తూ నిలబడింది. ఇప్పుడిక కుర్రవాడి రాకకు అర్థం తెలిసింది. కుర్రాణ్ణి చూశాను. పల్చగా, రేకులాగ తెల్లగా వున్నాడు. పెదవులలో ప్రత్యేకమయిన హుందాతనం. అంత చిన్నతనంలోనే ఠీవి, ఆ ఠీవి బలరాంలో లేదనిపించింది. బహుశా తల్లిపోలికేమో? ఆకళ్ళల్లో మెత్తదనం విచిత్రంగా కనిపిస్తోంది.

ఏదో పత్రిక వెదికి బయటికి తీశాను. ఇస్తూ అడిగాను "నీ పేరేమిటి ?"

"శేషు"-నవ్వేడు. ఆ నవ్వులో అమాయకత్వం ఏదో పాత జ్ఞాపకాన్ని గుర్తుతెచ్చేలాగ - ఆశ్చర్యపోయాను. అట్లా ఒక్కరే నవ్వగలరు-

పుస్తకం తీసుకొని మర్రిచెట్టు క్రిందుగా పరిగెత్తాడు. ఇంకా అక్కడే కన్పిస్తోంది ఎర్ర చీరె. శేషురాగానే ఎత్తుకొని ముద్దు పెట్టుకొంది. చేతిలో పుస్తకం చూస్తోంది.

ఉన్నట్టుండి ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. లోయలో పట్నంవేపు ఏదో పాత సినిమాపాట విన్పిస్తోంది. గాలిలోకి లేవలేక బలహీనంతో శబ్దం కొండల మధ్యనే గుంజాటన పడు

తోంది. ఇవాళ రెండు కోతులూ రాలేదు. ఏమీ తోచక కిటికీదగ్గర ఒంటరిగా కూర్చున్నాను.

## 2

మరి రెండు రోజులకే గవర్నరుగారు రావటంవల్ల ఆ ప్రాంతానికి ప్రత్యేకమయిన అందం వచ్చింది.

ఉదయాన్నే నగారా - 15 మంది పోలీసుల డ్రిల్లు, ఇంటిముందు పతాకావిష్కరణ. కాఫీ, ఫలహారాలకోసం పోలీసులందరూ కప్పులతో బంగళా వెనక వంటింటివేపు పరుగులు పరుగిడుతూ - ఆడవాళ్ళూ, మగవాళ్ళూ అంతా వాకిళ్ళల్లో కూర్చొని వింతగా చూసేవారు.

పర్సనల్ ఆఫీసర్ల పాగాలూ,వచ్చేపోయే జీపులూ,గవర్నరు భవనంపై ప్రత్యేకమయిన రంగులతో, రాజలాంఛనాలతో ఎగిరే పతాకాలూ అంతా విచిత్రంగా వుండేది.

గవర్నరుగారు వచ్చినమర్నాడే నా శ్రీమతికూడా వచ్చి చేరింది. వస్తూనే "మీ మిత్రులెవరో చాలా మంచివారండీ. నన్ను తీసుకురావాలన్న ఆలోచన ఆయన చెప్తేనే కాని మీకు తెలిసిందికాదు" అని దెప్పి పొడిచింది.

సుఖాన్నికూడా కొందరితో పంచుకోవడానికి స్వార్థం అడ్డొస్తుంది. ఇక్కడి సుఖంలో, స్వేచ్ఛలో ఆమెకు పాలు ఇవ్వాలేమోనన్న భయంతో ఒంటరిగా వచ్చాను. కాని

యిక్కడికి వచ్చాక యీ నిశ్శబ్దంలో, ఒంటరితనంలో ఎంత ప్రళయం ఉందో అర్థమయింది.

"అయితే యిక్కడున్నన్నాళ్ళు మీ పని ఏమిటండీ?" అనడిగింది రాజేశ్వరి.

"గవర్నరుగారికి, సిబ్బందికి భోజనానికి కావలసిన కూర గాయలు తీసుకురావడం. అవన్నీ సమయానికి చేరేటట్టు చూడడం."

ఆవిడ కిదేం నచ్చలేదు. "గుమాస్తాల పని యిదా ?" అని విసుక్కోయింది.

"గుమాస్తాల పని ఆఫీసులో. నేను యిక్కడ కూర గాయల గుమాస్తాని."

మర్నాడు సాయంకాలం నేను వచ్చేసరికి మా ఆవిడ ఎదిరింటిలోంచి వస్తోంది "ఆవిడ చాలా మంచిదండీ, బాగా చదువుకొంది కూడాను. ఎంతసేపూ హాస్యంగా నవ్వుతూ మాట్లాడుతుంది" అంది కాఫీ ఇస్తూ.

"ఎందరు పిల్లలేమిటి ?"

"ఇద్దరు, ఓ సంవత్సరం తేడాలో పుట్టారట. ఎంత అందంగా ఉంటారనుకున్నారు? మధ్యాహ్నం మన ఇంటికి వచ్చి కూచొని రెండుగంటలసేపు మాట్లాడి వెళ్ళింది. "టీ" చాలా బాగా చేస్తుంది."

"అదెలా తెలుసు ?"

"వాళ్ళింట్లోంచి "టీ" పొడి తీసుకొచ్చి ఇక్కడే చేసింది.

నలుగురితో గడపడం అంటే చాలా యిష్టమట. ఒంటరిగా ఈ రెండురోజులూ ఉండలేక పోయానంది."

సాయంకాలం రెండు కోతులూ వచ్చాయి. వాటిని చూస్తూనే రాజేశ్వరి కెవ్వున కేకవేసింది. "అవేం చెయ్యవులే, నేను స్నేహం చేశాను" అన్నాను. అన్నా వినక వాటిని పంపించేస్తే నే కాని వీల్లేదని పట్టుబట్టి కూర్చొంది. కోతులు స్థంభాన్ని పట్టుకొని నిలబడి మా ఆవిణ్ని విచిత్రంగా చూస్తున్నాయి. ఆవిడ అరుపులు ఎంతకీ బోధపడక కాబోలు- చివరికి రెండూ కూచుని వెక్కిరించడం ప్రారంభించాయి. ఇక మా ఆవిడ గంగవెర్రులెత్తి పోయింది. నాకు ఒకటే నవ్వు.

పదిరోజులతరవాత ఓరోజు గడియారం పక్కన ఉండవలసిన నావాచీ కనిపించలేదు. యాదృచ్ఛికంగా దానికోసం వెదికేసరికి ఆ విషయం తెలిసివచ్చింది. విజయవాడలో గడిపే రోజుల్లో తీయించుకున్న ఫొటో అది. కన్పించకపోయేసరికి మొదట ఆశ్చర్యపోయాను. కోతులు తీసుకుపోయాయేమో ననుకున్నా. వాటికి ఈ మధ్య ఆ అలవాట్లని బిస్కట్లద్వారా తప్పించగలిగాను కదా? - రాజేశ్వరిని అడిగితే మొదట తెల్లబోయింది. "ఎలా పోతుందండీ?" అంది. రోజంతా ఆలోచించాక మర్నాడు ఆ విషయం చెప్పింది - రెండురోజుల క్రిందట ఎదురింటావిడ ఆ ఫొటో చూసి "ఈయనేనా మీ వారు?" అని అడిగిందట. అవునని లోపలికి వెళ్లి వచ్చేసరికి, యింకా ఆ ఫొటోను అలాగే చూస్తోందట. తనని

చూసి నవ్వేసి, ఈ ఫ్రేము ఎంత బాగుందండి, అదే చూస్తున్నాను అని అక్కడే పెట్టేసిందట.

నేను నిర్ఘాంతపోయాను. నా ఫోటోమీద ఎదురింటావిడకి ఆసక్తి ఎందుకని?

ఒక విషయంమీద ఆసక్తికి ప్రాతిపదిక సాధారణంగా ఏ పాత అనుభవాల జ్ఞాపకంలోనో వుంటుంది. ఓ మంచి అద్భుతాన్ని చూసినప్పుడు ఏ ఆనందమూ మనస్సుకి తాకదు. కాని ఆ అద్భుతాన్ని మనసులోని ఏదో జ్ఞాపకంతో పోల్చుకున్నప్పుడు కలిగే ఆనందం అవధి లేనిది. అందువల్లనే తాజ్‌మహాల్‌ని చూసినప్పుడు కొందరు ఆనందాన్ని పట్టలేకపోతే, కొందరికి గుండె పగిలేటట్టు ఏడవాలనిపిస్తుంది.

నా ఫోటోమీద ఆమె కనబరచిన ఆసక్తికి ఏ విధంగానూ అర్థం చెప్పలేక పోయింది మనస్సు. ఆమె చాలా విచిత్రమయిన వ్యక్తి అని మాత్రం అనుకొని స్థిమిత పడ్డాను.

ఎప్పుడూ ఎండలో మెరిసే చీరలే కట్టుకొంటుంది. మర్నాడు నేను ఆఫీసుకు బయలుదేరబోతూంటే మర్రిచెట్టు నీడలో కొడుకుని ఎత్తుకొని నిలబడి ఏవో పక్షుల్ని చూపిస్తోంది. "త్వరగా వచ్చెయ్యండి" అని వెనకనుంచి రాజేశ్వరి అరుస్తోంది. తలవొంచుకు నడిచి వెళ్ళిపోయాను.

సాయంకాలం యింటికి వచ్చేసరికి ఓ విచిత్రమయిన విషయం చెప్పింది మా ఆవిడ.

ఎదురింటావిడ కొడుకుని ఎత్తుకొని వచ్చి ఫోటో ఫ్రేము యిచ్చిందట. "వాళ్ళ అబ్బాయి తీసుకెళ్ళాడటండీ. మీ ఫోటోను చింపేశాడట. క్షమించమని చాలా నొచ్చుకుంటూ చెప్పిందండి" అంటుంది మా ఆవిడ.

నాకిదంతా ఏదో ప్రయత్నంలో జరిగిన సంఘటనలాగ కనిపించింది. ఆ విషయమై ఆలోచిస్తున్నకొద్దీ ఎదురింటావిడని చూడాలన్న ఆసక్తి పెరిగింది.

"ఫ్రేము ఎవరు తీసుకొచ్చి యిచ్చారు?"

"ఆవిడే."

"కావాలనే తీసుకెళ్ళిందేమో?"

"అదేమిటండీ మీ ఫోటో ఆవిడ ఏం చేసుకొంటుంది?"

అక్కడితో ఆలోచనలకి బ్రేక్ పడింది. ఆ ప్రశ్నకు జవాబు అంత సులువుగా తేలేదికాదు. ఊరుకున్నాను.

మర్నాడు రాత్రి "కారెట్స్" కోసమని చిత్తూరువెళ్ళిన జీపు తిరిగి రాలేదని బంగళాలో ఎదురుచూస్తూ కూర్చోవడంతో పది దాటిపోయింది. ఓ సంచిలో యిన్ని కారట్స్ పోసుకొని యింటికి బయలు దేరాను

ఎప్పటిలాగా ఎలక్ట్రిక్ స్తంభం చాటున మామూలు దీపం వెలగడంలేదు. తలవొంచుకు నడుస్తూంటే మల్లెపువ్వుల వాసన నన్ను ఆపింది. తీరా చూస్తే ఎదురుగా ఆవిడే—ఎదురింటావిడ!

దీపంనీడలో ఇంకా మల్లెపువ్వులగుర్తు తెలుస్తోంది. అనుకోకుండా ఆగిపోయాను. ఓ కుర్రాణ్ణి ఎత్తుకు నిలబడింది. మరొక కుర్రాడు స్తంభంచుట్టూ గిరికీలు తిరుగుతున్నాడు.

నవ్వుతూంది నన్ను చూసి—

"ఇంకా పోల్చలేదూ నన్ను!"

ఆ కంఠం గుర్తు దొరికింది. రక్తం ఒక్కసారిగా పొంగి నరాన్ని కదిపింది. నాలుగైదేళ్ళ క్రిందటి గతం ఒక్కసారిగా కళ్ళముందు కదిలి వళ్ళు పులకరించింది అప్పట్లో నా జీవితాన్ని రెపరెపలాడించిన వ్యక్తి గుర్తుకొస్తోంది. కాని – కాని – వసంతేనా!

"అయితే యీసారి చూడు" అని వెలుగువేపు తిరిగితే గుండె ఝల్లుమంది. "వసంతా!" అన్నాను.

"ఇన్నాళ్ళూ పోల్చుకోలేకేమిటా అని నా ఆశ్చర్యం. మొన్న ఫొటో చూసేవరకూ నువ్వని తెలీదు నేనే కొట్టేశా ననుకున్నావా ఫొటోని!" నవ్వుతూంది.

ఆ నవ్వుకోసమే – ఆ నవ్వువల్లే మోసపోయాను నేను. మళ్ళీ అదే ఆయుధాన్ని సిద్ధంచేస్తోంది. "అలా నవ్వకు. నాకు భయం."

ఇంకా కిలకిల మంది. అంతలో ఆగి, "పోనీలే నిన్ను బాధ పెట్టను" అంది. స్తంభాన్ని పట్టుకు ఊగుతున్న అబ్బాయి యిప్పుడు తల్లిని పట్టుకు నిలబడ్డాడు.

చటుక్కున ఏదో ఆలోచన తొలిగుండెలో హఠాత్తుగా ప్రారంభమయింది. మర్రిఆకులు కదిలి చలిగాలి రివ్వు

మంది. కుర్రాళ్ళమాటలు యిప్పుడు స్పష్టంగా తెలుస్తున్నాయి. దాదాపు ఆరేళ్లుదాటవు యిద్దరికీ. ఒకే విధంగా, ఒకే రకం దుస్తులు - తెల్లగా తీవిగా వున్నారు.

ఇంతసేపూ ఓ ప్రశ్న గొంతులో కొట్లాడుతోంది. అది సంభవమా అన్న ఆలోచనకు యింకా మనస్సులో పొత్తు కుదరడంలేదు. ఇంకా ఆమెకళ్ళల్లో చిలిపితనానికి నా మనస్సు బెదిరిపోతోంది.

గ్రహించినట్టుంది - "ఏదో అడగాలని బాధపడు తున్నావు అడుగు" అంది. అంతటితో ఆ కాస్త ధైర్యం సన్న గిల్లింది. "వీళ్ళద్దరిలో ఎవరనేనా?" - తనే అడిగింది. ఆ ప్రశ్నకు జవాబు నేను అడగకముందే సిద్ధంగా ఉంచుకున్న ట్టుంది. సరిగ్గా ఆ విషయాన్నే వూహించినందుకు ఆశ్చర్య పోయేను.

"ఊఁ" అన్నాను.

"చెప్పుకో చూద్దాం" ఇంకా ఆ కళ్ళల్లో చిలిపితనాన్ని వదులుకో లేదు.

ఇద్దర్నీ చూశాను - ఆ చీకటిమధ్య వాళ్ళలో తేడా కనిపెట్టలేకపోతున్నాను. ముఖంలో వాళ్ళలో నా పోలికని వెదుక్కోవడం సాధ్యంకాలేదు, విసుగేసింది.

"నిన్ను మరిచిపోయి సుఖంగా బ్రతుకుతున్నాను నేను. నాకు పిల్లలు లేరు. మళ్లా నన్ను కదపకు" - అనేసి వచ్చేశాను, ఆ పిల్లల్ని చూడాలన్న కుతూహలాన్ని చంపుకొని.

అయినా తెలివితక్కువగా వసంత ఏ పనీ చెయ్యదని నాకు తెలుసు. నేను ఊహించినదంతా నిజమయి - ఆమె నవ్వుకు అర్థం అదేఅయితే వాళ్ళిద్దరిలో ఎవరో ఒకడు నా కొడుకే అయివుండాలి. కాని బలరాం అంతటి విషయాన్ని సహిస్తూ ఉండగలిగాడు? వాళ్ళిద్దరిలో ఎవరో ఎలా పోల్చడం ఇవన్నీ తీరని సమస్యగా మిగిలిపోయాయి నాకు.

# 3

ఏదో కలలో జరిగిన కథలాగ గుర్తున్నాయి అయి దేళ్ళ కిందటి విషయాలు.

ఓ సూట్ కేసూ, పరుపూ, రెండు కుర్చీలూ, పది పుస్తకాలూ, వీటితో విజయవాడ మధ్య గడిచే 50 రూపా యల జీవితం నాది - అప్పట్లో.

జీవితాని కేమీ ఆశల్లేవు. ఉండాలని తెలీదు. అందు కని 50 రూపాయలలో-'సుఖానికి పరాకాష్ట యిదేనేమో!' అన్నంతగా హాయిగా గడచిపోయేదికాలం. మధ్య మధ్య కృష్ణానది గాలిసీ, సత్యనారాయణపురం కొండలలోని నిశ్శ బ్దాన్నీ రుచి చూచి వచ్చేవాడిని.

కాని వసంతని చూశాక జీవితంలోని అసంపూర్ణత మొదటిసారిగా తెలిసివచ్చింది. ఎప్పుడూ వసంతని ప్రేమించ లేదు నేను. అసలు ఆ పదానికి నా దృష్టిలో అర్థంలేదు. అయినా వసంతని చూస్తేనే ఆమె 'ప్రేమ' అనే చిన్న సెంటిమెంటుకు లొంగిపోయే మనిషికాదని అర్థమయింది.

కోరిక, తపన అనే పిచ్చిభావాలకు విజ్ఞులు పెట్టుకున్న నాజూకు పేరు "ప్రేమ." అవి ఎంత అనిశ్చితాలో, ప్రేమా అంతే.

ఓ రోజు రూంలో కూర్చుంటే, చిన్న సంచీ చేతపుచ్చుకొని 'వసంత' గది ముందుకు వచ్చి నిలబడింది. నిర్ఘాంతపోయి చూశాను. ఓ ఉత్తరం యిచ్చింది. వేణు రాసి ఇచ్చిన ఉత్తరం అది. "ఈమె నా చెల్లెలు. పాతకథంతా యిప్పుడు చెప్పడం సాధ్యంకాదు. ఎవరితోనో సంవత్సరంక్రితం మద్రాస్ వెళ్లిపోయింది. కాని ఇటీవల ఆయన ఎక్కడా కనిపించకుండా పోయాడట. ఏం చెయ్యాలో తోచక యింటికి వస్తానని ఉత్తరం రాసింది. నాన్నకు ఒంట్లో బాగ లేదు. ఇప్పటికే ఆమెమీద బెంగపెట్టుకొని ఉన్నాడు. చూస్తే గుండె బాదుకుంటాడు. ఆలోచిస్తే నువ్వే కనిపించావు. అక్కడేదన్నా పని చూపించు. కొంతవరకూ చదువుకొంది. నీకది సాధ్యం కాకపోతే, మరోమార్గంలేదు. తనమార్గం తనని చూచుకోమని చెప్పు. సహాయం చేస్తావని ఆశిస్తాను" - ఇదీ ఉత్తరం.

నిర్ఘాంతపోయి ఆమె ముఖం చూశాను. ఎటువంటి భిడియం, విచారం, పశ్చాత్తాపం లేదు. నిశ్చలంగా నిలబడింది.

"కూర్చోండి" అంటే లోపలికి వచ్చి కూచుంది. "తప్పు చేశారు మీరు" అని కొంత సేపటికి అన్నాను. నవ్వింది. ఆ నవ్వులో శంకలేదు. తనకి ఆ శిక్ష తగినదే అన్న విరక్తి - ఆ నవ్వులో-

"అవును. జరిగిపోయాకనే ఏదైనా తెలుస్తుంది"

"ఏం చేస్తారిప్పుడు ?"

"ఏమో తెలీదు" అంది క్లుప్తంగా.

ఆలోచించాను, అన్నిటికీ పెద్ద ఆటంకం ఆమె వయసు. నేను ఒంటరిని అందువల్ల ఆ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరించాల్సిన అగత్యం ఏర్పడింది. నలుగురి దగ్గరికీ వెళ్ళి నాలుగు ప్రయివేట్లు కుదిర్చాను. ప్రతినెలా నేను పదిరూపా యలు యివ్వడానికి నిశ్చయించుకున్నాను. ఓ స్నేహితుడి సహాయంతో చిన్నగది చూసిపెట్టాను. మొత్తంమీద - ఓ నెల తిరిగేసరికి పరిస్థితి అంతా మామూలయింది.

వసంతలో విచిత్రమల్లా గతం ఉన్నట్టు కనిపించదు. గతంతో రాజీపడకపోవడం మనస్సు విధించే పెద్దశిక్షలో ఒకటి. చాలా ఉద్రేకాలను, చాలా అనుభవాలను మనస్సులో దాచుకోలేని వ్యక్తి ప్రపంచంపై వాటిని రుద్దబోయి అన్ని టినీ పోగొట్టుకుంటాడు. మనస్సులోనే అన్నిటినీ దాచుకున్న వ్యక్తి ప్రపంచాన్ని తన అవసరానికి లేకుండా చేసుకొంటాడు. అందువల్లనే సమన్వయం అవసరం పాత అనుభవాలు మత్తు మందులాంటివి. వాటిని పూర్తిగా వదులుకొనకూడదు. పూర్తిగా తాగనూకూడదు.

కాని వసంత ఎంతో గతాన్ని వెనకేసుకోడానికి చిరు నవ్వు నాధారం చేసుకున్నదనిపించింది.

*　　*　　*

ఎప్పుడన్నా అటువేపు వెళ్తే కళ్లనిండా కృతజ్ఞతని కనబరుస్తూ పలకరించేది. మనిషిలో పిరికితనం లేదు. దిగులు వున్నా బయటికి కనిపించనివ్వలేదు. ఒంటరిగా, స్వేచ్ఛగా బ్రతకడానికి ఈ అవకాశాన్ని ఆలంబనం చేసికొన్నదేమోనని పించింది. అంత దెబ్బకు తట్టుకొని బ్రతకడం సాధ్యమన్నది నా ఊహాకందని విషయం.

"మీరు చాలా తెలివైనవారే — ఎలా మోస పోయారు ?" అంటే ఒకటే జవాబు చెప్పింది.

"ఏ తెలివీ కోరికను జయించలేదండి, నేను ఆడ దాన్ని."

ఆ మాత్రంకూడా ఏ ఆడదీ చెప్పుకోదేమో ? - ఆ విధంగానూ ఆమె వాళ్ళకంటే అతీతంగా కనిపించింది.

"మీకు కృతజ్ఞతా ఎలా చెప్పుకోడం?" అని పృచ్ఛి స్తున్నట్టుండేవి కళ్ళు.

"వాటిని చూస్తే నాకు భయం. ఆ కళ్ళల్లో అంతబలం లేకపోతే మీకు యింకా సహాయం చేసేవాణ్ణి" అని ఓసారి అంటే - "ఏం చేసేవారు !_నన్ను పెళ్లి చేసుకొనేవారా?" తన మనస్సును కష్టపెట్టే పరిహాసాన్ని తానే చెప్పేది. అప్పటి నవ్వు ఓ అనుభవం. అంతకన్నా ఏమీ చెప్పలేను.

ఓ రోజు నాకు బాగా జ్ఞాపకం. రాజకీయ బహిరంగ సభకు వెళ్లి మధ్యలో హోరున వర్షం ఎత్తుకోవడంతో తప్పించుకొని బయటపడ్డాను. ఆమె రూం పక్కనుంచి వెళ్తూంటే

కిటికీ దగ్గర కనిపించింది. లోపలికి వచ్చాను. నన్ను చూస్తూనే మొదట తుళ్లిపడింది. అంతలో నవ్వు తెచ్చుకుని పలకరించింది.

"మీరు ఆలోచిస్తూ కూర్చోగా యిదే చూడటం. ఆశ్చర్యంతో లోపలికి వచ్చాను. రాజకీయ మహాసభల్లో వర్షాలుకూడా భాగమేనని యివాళ తెలిసింది"—నవ్వేను.

ఆ కళ్ళలో మెత్తటి దిగులు కనిపించింది నాకు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు చెప్పండి" అన్నాను కాస్సేపటికి.

"మీ గురించి, నాకు ఎందుకు సహాయం చేశారా అనుకొంటాను. ఆరునెలల క్రిందట మీ దగ్గరికి వచ్చేముందు నాకే సమస్యాలేదు, ఒక్క చావు తప్పించి. ఇప్పుడు చాలా పెద్దసమస్య ఏర్పడింది"—

"ఏమిటది?"

"బ్రతకడం"—

వర్షం తగ్గాక దళసరి శాలువా తీసుకొచ్చి యిచ్చింది. "చాలా పెద్దసహాయం పొందడంకూడా ఒక తప్పేనండి. మద్రాసుపోయి ఎంత నేరంచేశానో, మీ సహాయం పొంది అంతనేరమూ చేశాననిపించింది. నా అంతట నేను బ్రతకగలగడం ఎంత సుఖం?"— అంతలో నా దిగ్భ్రమను చూసి నవ్వి "ఊరికే అంటున్నాను లెండి. మనస్సు బాధ పెట్టుకోకండి. మీ సహాయానికి ఏదో రూపంలో కృతజ్ఞతను చెప్పుకొంటాను" అంది.

ఆరాత్రి వర్షంలో నడుస్తూ వసంతను వెయ్యి విధాలుగా ఊహించుకొన్నాను.

మానసికంగా విప్లవాన్ని సాధించాలన్న తపనతో శక్తిచాలని మనస్సు పెనుగులాట ఆమెలో కనిపించింది. ఆలోచనలు పెరిగినంతగా మనస్సు పెరగలేదు. పరిస్థితుల్ని మనమే అనుకూలంగా మార్చుకోవాలని తెలియని యీ వయస్సులో అన్నిటికీ తలవొంచి, అనుభవాలకు లొంగి నిట్టూర్చడమే నేర్చుకొంది. మళ్ళీ పాతజీవితం గడపాలంటే యిప్పుడెట్లా? -

♦ ♦ ♦ ♦

నిజంగానే కృతజ్ఞతను పూర్తిగా కనబర్చింది.

కృతజ్ఞతకు ఒకపరిధి అంటూ కన్పించదు. ఆ సంఘటన తరువాత కృతజ్ఞత ఎంతటిపదునైన ఆయుధమూ అని భయం కలిగింది. చాలా పెద్దనేరాన్ని కృతజ్ఞతముసుగులో దాచుకోవచ్చు. చాలా పెద్దకోరికను కృతజ్ఞత మాటున తీర్చుకోవచ్చు. కృతజ్ఞత అంటే వేరే మేమీలేదు. చేతకాని తనాన్ని కప్పిపుచ్చి, కోరికను ముందుకుతోసే సాధనం "కృతజ్ఞత."

మలేరియా వచ్చిన అయిదురోజులవరకు ఆమెఆలోచనే రాలేదునాకు. కాని ఆరోరోజు సాయంకాలంవసంతవచ్చిమంచం మీద నీరసంగా పడుకొన్న నన్నుచూసి నివ్వెరపోయింది.

టేబులుమీద ఇంజెక్షన్ సిరంజ్‌లూ, సీసాలూ, వాటిపక్క సీరసంతో లోతుకుపోయిన కళ్లూ చూసి కుప్పలా కూలి పోయింది.

ఒక్కక్షణం గడిచాక ఆమె అడిగిన మొదటి ప్రశ్న యిది :

"నాకీ విషయం ఎందుకు తెలియజెయ్యలేదు?"

జవాబు దొరక్క తికమకపడ్డాను. అంతే. కుర్చీలో కూలబడి ముఖం కప్పుకుని ఏడవసాగింది. తెల్లబోయేను. "ఇంత పెద్దశిక్ష భరించలేను నేను. నావల్ల ఉపయోగం లేక పోతే ఎక్కడికయినా పంపెయ్యండి నన్ను. నా సహాయం పొందాలనిపించకపోతే నేను వుండడం అనవసరం."

ఆమెను రప్పించడం ఎందుకు మానుకొన్నానో బోధ పడ్డానిక అవకాశం యివ్వలేదు నాకు. నన్నిక మాట్లాడవద్దన్నది. నా ఏర్పాట్లన్నిటికీ కుదుర్చుకొన్న బోయ్‌ని పంపే సింది. ప్రయివేట్లనుకూడా తగ్గించుకుంది. డాక్టర్ దగ్గరికి స్వయంగావెళ్ళి మందు తెచ్చేది.

నిజంగా నాలో చాలామార్పు వచ్చింది. బాధ్యతతో మనఃపూర్వకంగా చేసే సపర్య ఎంత అవసరమో అప్పుడు తెలిసివచ్చింది. ఎంత ఖర్చుచేసీ, ఎంత ప్రయత్నించీ అలాంటి వ్యక్తిని తెచ్చుకోలేను. వసంతలోని మాతృత్వం, ఔదార్యం, సహనం ఆ నాలుగురోజులలో తెలిసివచ్చాయి. ఆమెను వదలి పోయిన వ్యక్తి ఎంతదౌర్భాగ్యుడా అనిపించింది.

జ్వరంపోయినా యింకా నీరసం పదిరోజులవరకూ తగ్గ లేదు. డాక్టర్ కూడా నా రోగానికి విసిగిపోయాడు. మరీ రాత్రి నిద్రపట్టకపోతే స్లీపింగ్ పిల్స్ వేసుకోమని చెప్పాడు. ఈ పదిరోజులలో వసంత పూర్తిగా నలిగిపోయింది. కళ్ళకింద నీడలు, నుదుటిన ముడతలు, కళ్ళల్లో ఎరుపూ - ఎప్పటి కప్పుడు ఈ విషయాన్ని గుర్తుచేసేది.

"మిమ్మల్నిలా కష్టపెట్టడం చూస్తూంటే నా జ్వరం ఎప్పటికీ తగ్గదు" అంటే నవ్వేది.

"మీ కేం కావాలో మీకు తెలీదు. మీ శరీరాని కేం కష్టం లేనప్పుడు, మీ మనస్సులో ఏదో భాగం పాడయింది. పెళ్ళిచేసుకోండి త్వరగా" అంది ఓ సారి. ఆ మాటలకి నిర్ఘాంత పోయాను.

అంతవరకూ నా గురించి నే నెప్పుడూ ఆలోచించుకో లేదు. తీరా యిప్పుడు ఆలోచిస్తే, ఈ అస్వస్థత మనస్సుదే ననిపించింది. ఏదో అసంతృప్తి మనస్సుకు మిగిలిపోయింది. దానిని ఈ స్లీపింగ్ పిల్సూ, ఇంజెక్షన్లూ, మందులూ తీర్చలేవు.

ఆ సాయంకాలం ఆరుబయట బొగన్ విలా క్రింద కుర్చీ వేయించుకు కూర్చొన్నాను. కిటికీలన్నీ తెరిపించాను. మందులూ, డాక్టర్లూ అక్కర్లేదని చెప్పేశాను. నా చర్యలన్నిం టికీ వసంత ఆశ్చర్యపోయింది.

"రోగాన్ని సరిగ్గా చెప్పారు మీరు. ఇక చికిత్స ప్రారంభించాను" అన్నాను. రాత్రి పదిన్నరవరకూ వెన్నెల్లో కూచొని లోపలికి నడవబోతే నరాలన్నీ తిరుగుబాటు

చేశాయి. చల్లటిగాలికి నరాలు పట్టుకుపోయి మళ్లీ జ్వరం వస్తున్నట్టనిపించింది. నిజమే. కళ్లు మండుతున్నట్టున్నాయి.

గట్టిగా పిలిస్తే వసంత పరిగెత్తుకు వచ్చింది. నా ముఖంచూసి ఆశ్చర్యపోయింది నుదుటిమీద చెయ్యివేసి తుళ్ళిపడింది. "మళ్ళా జ్వరం ముంచుకొచ్చింది" అంటూ భుజంమీద చెయ్యివేసి లోనికి నడిపించింది.

ఆ రోజు నాకు బాగా గుర్తు. రాత్రంతా నాకు తెలీని తపనతో నిద్ర పట్టడంలేదు. శరీరపు అలసటకంటే మనస్సు అలసట వణికిస్తోంది. దుప్పటికప్పి నా పక్కనే కూర్చొంది వసంత. ఆరోజే నాకు చివరిరోజు అనిపించింది. అర్ధరాత్రి కళ్లు విప్పితే యింకా అక్కడే కూర్చొనివుంది వసంత.

"నువ్వుచెప్పిన మందు పుచ్చుకోకుండానే చచ్చిపోయేటట్టున్నాను" అన్నాను.

విచిత్రంగా చూసింది. "ఏమిటికి?"

"నా మనస్సుకు దగ్గర పడిన వ్యక్తిని"... నవ్వేను. మాట్లాడలేదు వసంత. అప్పటి ఆమె కళ్ళలో జాలి, కన్నీటి మెరుపు ఆశ్చర్యపరిచింది నన్ను. వసంత కన్నీళ్ళు కార్చడం ఎప్పుడూ చూడలేదు నేను.

"ఎందు కేడుస్తావ్ !" అంటేమాట్లాడదు. హఠాత్తుగా నన్ను కావలించుకొంది. "అలాంటి ఆలోచనలు పెట్టుకోకండి." అంటోంది. బలంగా కోరికతో పెనవేసుకొంది నన్ను. మాట్లాడడానికి నాకు అవకాశం యివ్వడంలేదు. నీరసంతో, ఆశ్చ

ర్యంతో మెదడు శక్తిని కోల్పోయింది. నిస్సహాయంగా ఆమె చేతులలో ఒరిగిపోయేను.

ఆ రాత్రి ఒక్కటే మా యిద్దరికీ మిగిలిన చివరి అవకాశంలాగ, ఇక రేపు మిగలనట్టూ, జీవితమంతా ఒకే కోరిక పెనవేసుకొని పదిరోజులుగా వదలుకొన్న శక్తి నంతటినీ ఆ క్షణంలో పూరించుకొని ఆమెని కావలించుకొన్నాను.

యివాళ ఆలోచిస్తే-ఆరోజు అనుభవానికి నా జీవితాన్నంతా అరణంగా యివ్వవచ్చు ననిపిస్తుంది.

దాదాపు ఆరునెలల తరువాత ననుకొంటాను. ఆఫీసుకు సంబంధించిన ట్రెయినింగుకు మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. వెళుతున్నానని చెపితే వసంత ఏమీ ఆశ్చర్యం, దిగులూ ప్రకటించ లేదు.

"వెళ్ళిరండి నాకేం భయం" అంది.

జ్వరం తగ్గాక తన గదికి వెళ్ళిపోయింది. ఎప్పుడన్నా వెళ్ళిచూసి వచ్చేవాడిని.

ట్రెయినింగ్‌కి వెళ్ళిన ఏడెనిమిది నెలలకి ఒక్క ఉత్తరం మాత్రం వ్రాసింది వసంత, తాను తల్లిని కాబోతున్న విషయం. మొదట అది చదివి దిమ్మెరపోయాను. వెంటనే ఏం చెయ్యాలో తోచలేదు నాకు. అనుభవంకంటే జ్ఞాపకం విధించే శిక్ష చాలా కఠినమయినది. అనుభవం క్షణికం. దాన్ని జీవితాని కంతటికీ పంచి విస్తృతంచేసే శక్తి జ్ఞాపకాలకుఉంది. అప్పుడలాగే అయింది. నాలుగురోజులుపోయాక "ఏం చెయ్యదల్చుకొన్నావు!" అని ఉత్తరం వ్రాస్తే-

"మీ ఉత్తరానికి నవ్వుకొన్నాను. మీరు చాలా భయపడి పోయినట్టున్నారు. నాకేం భయంలేదు. అన్నిటినీ మరిచిపొండి" అని వ్రాసింది. అంత తెగింపూ, ధైర్యం ఎలా సాధ్యమా అనిపించింది! నన్ను వేళాకోళం చేయడానికి అలా రాసిందేమో ననుకున్నాను.

ట్రయినింగ్ పూర్తిచేసుకుని వచ్చాక వెంటనే వసంత కోసం వెళితే ఆమె కనిపించలేదు. ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఇంక ఏం చెయ్యాలో తోచలేదు. తేరుకుని వేణుకి ఉత్తరం రాశాను. "నాకూ ఏమీ తెలియదు" అని వ్రాశాడు నాకు.

మరో మూడునెలల తర్వాత అనుకొంటాను, ఒక శుభలేఖ అందింది. అందులో వసంతపేరు, బలరాం పేరు చూసి విస్తుపోయాను. వసంత ఉద్దేశ్యం ఇలా జరపడమయితే, ఆనాటి సంఘటనకి అర్థంలేదు. ఏమయినా వసంతను అర్థం చేసుకొనేటంత నేను పెరగలేదేమో. స్త్రీ స్వభావాన్ని తెలుసుకోబోయి అనాదిగా ఎందరో ఓడిపోతున్నారు. నేను వాళ్ళకంటే ఏ విధంగానూ గొప్పవాణ్ని కాదు. అయితే ఎవరి మనస్తత్వంపైనా నాకు ఆసక్తిలేదు. వసంత నన్నెందుకు మోసం చేసిందన్న ఆశ్చర్యం మాత్రం మిగిలిపోయింది. ఏమయినా ఆమె తల్లికాబోతున్నదని వ్రాసిన విషయం నిజమా? అన్న ప్రశ్న అలానే మిగిలిపోయింది.

* * * *

అయిదేళ్ళ తర్వాత మళ్లీవేళ వసంతని చూస్తే పాత ఆలోచనలన్నీ గుర్తుకొచ్చాయి. ఆమెమీదకంటే ఆ కుర్రాళ్ల మీద ఆసక్తి ఎక్కువయింది. ఎంత అప్రత్యాశితంగా అప్రీతికరంగా జరిగిన సంఘటనయినా ఆ యిద్దరిలో ఎవరో ఒకరు నా రక్తాన్ని పంచుకొని పుట్టాడన్న ఆలోచన మాటిమాటికీ గుర్తుకొచ్చి స్థిమితం చిక్కనివ్వడంలేదు.

మరి రెండురోజులు ఆ కుర్రాళ్ళు కనిపిస్తారేమోనని ఎదురు చూస్తూ వాకిట్లో గడిపేవాడిని. ఏదో తెలీని ఉత్సుకత - వాళ్లని చూడాలనీ, మాట్లాడాలనీ.

ఇప్పుడిక తరుచుగా కన్పించేది వసంత. ఓసారి మధ్యాహ్నం మా ఆవిడకోసం వచ్చేసరికి నేను కనిపిస్తే తుళ్ళిపడింది. "ఏదీ మీ ఆవిడ" అంది గుమ్మానికి ఆనుకు నిలబడి.

ముఖం చూస్తూ కూచున్నాను. ఆ ముఖానికి నిండుదనాన్నిచ్చే బొట్టును చూశాక, యిప్పటి ఆమెమనస్సు మీద ఎటువంటి అనుమానమూ రాలేదు. ఏదో గుప్తసౌందర్యం ఆ కళ్లలో-

"ఎవరో చెప్పవూ ?" అని దీనంగా అడిగాను.

"ఏమిటీ" - ఏమీ అర్థం కానట్టు విచిత్రంగా చూసింది.

"ఆ యిద్దర్లో ఎవరు ?"

"ఎవరైతే మీకేం-మీకు దక్కరుగా?"

కాస్సేపయాక అడిగాను! "ఎందుకు వెళ్ళిపోయేవు ఆనాడు ? - నాకు చెప్పకుండా..."

పకాలున నవ్వింది. నా ముఖంచూసి "చెపితే ఏం చేసేవారు ?"

అనుకోకుండా వచ్చిన ఆ ప్రశ్న నా ఆలోచనల్ని అడ్డుకొంది. నిజమే. వెళ్ళకపోతే తనేం చేసేవాడు ? వసంత దృష్టిని అంతగా భవిష్యత్తువేపు ఎలామళ్ళించగలిగిందా అన్న ఆలోచన యింకా నిర్విణ్ణతను కలిగిస్తోంది.

"చాలా ఆలోచించే చేశావన్నమాట ?"

"యిలా జరుగుతుందని తెలిస్తే - మీరు అసలు దూరంగా ఉండేవారు కదూ?" - నేను జవాబుకు తికమక పడడంచూసి జాలిపడి "పోనీలెండి. నే పోతాను"- వెళ్ళబోతే మా ఆవిడ వచ్చింది.

"అరె! వచ్చి వెళ్ళిపోతున్నారే!" అంది.

"వచ్చి చాలాసేపయింది. మీ ఆయనతో మాట్లాడు తున్నాను ఆయన నా కిదివరకే తెలుసు. మొన్న ఆ ఫోటో చూసినప్పుడే అనుకొన్నాను.

మనస్సంతా ఒక్కసారి ఆలోళిత మైంది. ఆ క్షణాన నా జీవితమంతా వసంత పాదాలదగ్గర ఉన్నట్టనిపించింది.

మా ఆవిడ ముఖంలో ఆశ్చర్యం స్పష్టంగా తెలిసింది. ఆమె తెల్లబోయిందని తెలిసికూడా ఆగలేదు వసంత. "ఏం ? అంతేనా ?" అంటోంది నావేపు తిరిగి. నేను లేనినవ్వును తెచ్చిపెట్టుకు తలవూపాను.

"నా కెప్పుడూ చెప్పలేదేమండీ ?" అని మా ఆవిడ అంటే, "ఆయనకు మాత్రం ఏం తెలుసు ? నేను రోజూ ఆయనకు ఎదురుగ్గా నిలబడుతున్నాను కనకా ?"

మాటల్లో నామీద ఆమెకు ఎంతో అధికారం వున్నట్లు తోస్తే- ఇంకా విస్తుపోయింది మా ఆవిడ. మరికొన్ని క్షణాలు అలా గడిస్తే నా జీవితం ఏమవుతుందో తెలీదు.

"ఇక వెళ్ళు వసంతా. నీ మాటలువింటే ఇది బెదిరిపోతుంది-పిచ్చి ఎత్తినా ఎత్తవచ్చు" అని నవ్వుతూ అన్నాను.

తానూ నవ్వుతూ మా ఆవిడ భుజంపై చెయ్యి వేసింది. "మీ ఆయన మాటలు విని ఎప్పుడన్నా బెదిరిపోయారా మీరు?"-అని నావేపు చూస్తూనే రాజేశ్వరితో అంది. "నిజానికి నన్ను పెళ్ళిచేసుకొంటే బాగుండేదండి మీ ఆయన. మీరింకా ఆయనకు చాలా నేర్పాలి-ముఖ్యంగా ఆడవాళ్ళు మట్టిబొమ్మలు కాదన్న సంగతి. వాళ్ళకీ మనస్సు ఉన్నదన్న సంగతీను. నేను వెళ్తానండి" అని నాలుగడుగులు ముందుకు వేసి, మళ్లా ఏమనుకున్నదో యేమో వెనక్కు - తిరిగి మా ఆవిడ దగ్గరకు వచ్చింది : "మీరేమీ అనుకోరుకదూ నా మాటలకి ? — మాట్లాడ్డం నా వ్యసనం, మీరంటే నాకెంతో గౌరవం. మీ మనస్సు నొప్పిస్తే నేను చాలా బాధపడతాను"—అనేసి వెళ్ళిపోయింది.

ఎరుపు మాయమయేవరకూ చూస్తూ నిలబడ్డాను. ఆమెమాటల్తో,ఆ అసంకల్పిత సంఘటనలతో మనస్సు సంత్రస్త

మయింది. రాజేశ్వరి మనస్సులో ఆందోళనని ఊహించుకుని భయపడ్డాను.

లోపలికివచ్చి చూస్తే మంచానికి తల ఆనించి రాజేశ్వరి ఏడుస్తోంది. లోయమధ్యనుంచి ఏదో పొగ మెలికలు తిరిగి యిళ్ళమీద మాయమవుతోంది. నీలిరంగు కప్పినట్టు క్రింద ఊరంతా కన్పిస్తోంది. ఆమెను ఎలా ఊరుకోమని చెప్పాలో అర్థం కావటంలేదు.

"వసంత మనస్సులో ఏదీ దాచుకోదు. ఉత్త భోళా మనిషి. ఆ మాటలకి బాధపడవలసిన అవసరంలేదు. రాజీ!" అంటే—

"మీకు ఏదో రహస్యాలున్నాయి. ఆవిడదగ్గర నన్నట్లా అవమానించకపోతే ముందే చెప్పకూడదూ!" అంటుంది.

ఆమె వసంతని అంతవరకూ ఎలా తెలీదో, మా యిద్దరి స్నేహమూ మా మనస్సులకే ఎలా పరిమితమో చెప్పడమో చాతకావడంలేదు. పూర్తిగా డీలాపడి బంగళావైపు నడిచాను.

ఎవరో మంత్రి వచ్చినట్లున్నారని నాగభూషణం కనిపించి చెప్పాడు. పోలీసులు వరసకట్టి నిలబడి వున్నారు. కోటు తొడుక్కొని బంగళాలోకి నడిచాను.

## 5

ఎన్నాళ్లుగడచినా నా అనుమానం తీరలేదు. ఆ యిద్దరిలో ఎవరో పోల్చుకోలేక పోతున్నాను. నా తాటస్థ్యాన్ని

వేరేవిధంగా అర్థం చేసుకొంది మా ఆవిడ. ఓరోజు ఖండితంగా చెప్పేసింది. "ఈ ఊరు నాకు నచ్చలేదండి. ఇక్కడ్నుంచి పోదాం" అంది.

నేను నిర్ఘాంత పోయాను. "అదెలా! నేను గవర్నర్ని కాదు- నా యిష్టం వచ్చినప్పుడు క్యాంపుఎత్తుకుని పోవడానికి. గవర్నరు వెళ్ళేదాకా మనమూ యిక్కడ ఉండితీరాలి."

కాని ఎంత చెప్పినా వినలేదు. "అయితే మీరే ఇక్కడ వుండండి. నేను పుట్టింటిదగ్గర ఉండి వస్తాను. ఇక్కడఉంటే నాకిక పిచ్చి ఎత్తుతుంది."

"వసంతని గురించి బాధపడుతున్నావేమో నువ్వు. అదేం మనసులో పెట్టుకోకు."

"అదేం కాదు, నా కిక్కడ బాగులేదు అంతే."

◆ ◆ ◆

ఆ మర్రిచెట్టు నీడలో నిలబడి, నేను చూస్తుండగా ఎలక్ట్రిక్ దీపం వెలుగులోకి వచ్చి, కుర్రాళ్ళను గుండెకు హత్తుకొని, వాళ్ళని తృప్తితో ముద్దుపెట్టుకొని, నాకేదో తీరని శిక్ష విధిస్తున్నట్లు గర్వంగా చూసేది వసంత.

ఆనాటి సంఘటనలో నా రక్తం పరుగూ, ఆమె త్యాగంలో ఔన్నత్యం, నా పిరికితనం స్త్రీత్వపు విలువ

పూర్తి స్వరూపం—గుర్తొచ్చి మనస్సు అనునిత్యం స్మృతి, విస్మృతుల మధ్య కొట్టుమిట్టులాడేది.

కొన్నాళ్లకి నా మనస్సు పాడయినట్టనిపించేది. బలరాంని అడిగాను. "ఈఊరు నాకేం బాగులేదు సార్! ఆరోగ్యం కూడా చెడేటట్టుంది. నన్ను రిలీవ్ చేసే అవకాశం ఉంటుందేమో చూడండి—"

మొదట తెల్లపోయేడు, "అదేమిటోయ్? మొదట యివన్నీ చూసి మూర్ఛపోయావు. ఇప్పుడేం?"

"అందానికీ, ఆరోగ్యానికీ సంబంధం లేదండీ, మరి కొన్నాళ్లుంటే ఏ బ్లడ్ ప్రెషరో, టీబీవో వచ్చితీరుతుంది. ప్లీజ్" అన్నాను.

◆ ◆ ◆

మర్నాడు సాయంకాలం మళ్లీ కన్పించింది వసంత. చాక్లెట్ రంగు చీరె తలమీద కప్పుకుని, కుడివేపు కొంగుని గాలిలో వదిలింది. కళ్ళు వయస్సులో మెత్తబడుతున్నా, పాత దీప్తిని పూరించుకోవాలన్న తాపత్రయం తెలిసింది.

"వెళ్లిపోతున్నారటగా?"

"ఎవరు చెప్పారు?"

"ఆయన".

"అవును, నీవల్లే".

"నేనేం చేశాను, మిమ్మల్ని పెళ్లి చేసుకోమని అడగలేదు".

"అయితే దాచకుండా చెప్పు"

"ఏ విషయం?"

"ఏ విషయమో నీకు తెలుసు".

ఎంతసేపో మాట్లాడకుండా నిలబడిపోయింది. ఎలక్ట్రిక్ దీప స్తంభానికి ఆనుకొని చేతులు తలవెనుక ఆనించుకొని నా కళ్ళలోకి చూస్తోంది.

"ఏమిటలా చూస్తున్నావు"

"చెప్తే మీరు తట్టుకోగలరా అని" — అంతలో సర్దుకొని "పోనీ చెప్పనులెండి మరి నన్నా ప్రశ్న అడక్కండి. ఎప్పుడు వెళ్ళిపోతారు మీరు?"

మాట మార్చుతున్నందుకు నివ్వెరపోయాను. "మీ ఆయనమీదే ఆధారపడివుంటుంది."

"అయితే మిమ్మల్ని త్వరగా పంపెయ్యమని చెప్తాలెండి."

వెళ్ళిపోయింది. ఆ చిన్న వెలుగులో ఆమెముఖం చూసి వసంత కన్నీరు కారుస్తోందా అనుకొన్నాను. కాని ఆమెముఖం చూడడానికి మళ్ళీ నాకు అవకాశం ఇవ్వలేదు. కళ్ళు ఎత్తేలోగా దీపపువెలుగులో మాయమయింది.

♦ ♦ ♦ ♦

విజయవాడ వచ్చిన పదిహేనురోజులవరకు వసంతను గురించిన ఆలోచనలు నన్ను విడిచిపెట్టలేదు. హఠాత్తుగా ఒక

ఆలోచన తోచి జననమరణాల రిజిస్ట్రార్ ఆఫీసుకు బయలు దేరాను.

గుమాస్తా దగ్గరికి వచ్చి "ఒక సమాచారం కావాలండీ" అన్నాను.

"ఏమిటి?"

"1955లో వసంత అనే ఆవిడకు బిడ్డ పుట్టిన సమాచారం కావాలి."

"ఆ విషయంతో మీకేం సంబంధం?"

"నేను ఆ బిడ్డ తండ్రిని."

పక్కున నవ్వేడు ముసిలి గుమాస్తా. తండ్రికే తెలియదా పుట్టిన బిడ్డ విషయం?"

ఎలా చెప్పాలో తెలియలేదు. "కొన్ని కోర్టువ్యవహారాలకు ఆ విషయం అవసరం" అని అబద్ధం చెప్పాను. ఎన్నో నిదర్శనాలుచూపి, తర్జనభర్జనలు జరిపాక, రెండురోజుల తరువాత విషయం తెలిసింది. వసంతకు కూతురుపుట్టి చచ్చిపోయిందని.

ఒక్కొక్కప్పుడు మనస్సు చాలా విచిత్రమయిన పరిస్థితుల్లో విచిత్రంగా విశ్రాంతిని వెదుక్కొంటుంది. హాలాహాలంనుంచి అమృతం, దుఃఖంనుంచి మనశ్శాంతి, సుఖంనుంచి సంతృప్తి ఎంత సంభవమో – అత్యంత విషాదకరమైన పరిస్థితులనుంచి మనస్సు విశ్రాంతిని వెదుక్కోవడం అంతే సంభవం – వసంతకు కూతురుపుట్టి చచ్చిపోయిందని తెలిసినప్పుడు "రిలీఫ్" అంటారే! – అదే కల్గిం దప్పుడు.

దుఃఖం రాలేదు. ఎందుకో చెప్పలేను. పుట్టినకూతురి మీాద ప్రేమతో కలిగిన దుఃఖంకంటె, నా పాత అనుభవానికి నిదర్శనం ఏమీా లేదన్న తృప్తి నన్ను స్థిమితపరిచింది.

ఆ విషయం వినగానే ఎందుకు భోరుమని ఏడవలేదా అని యిప్పటికీ ఆశ్చర్యం.

బహుశా ఆ కుర్రాళ్ళలో ఎవరు? అని వెదుక్కోవడంలో ప్రేమతో కూడిన ఆతృతకంటే, నా పాత అనుభవానికి యింత గట్టి నిదర్శనం మిగిలిందన్న భీతి ఎక్కువగా వుందేమో!

మనప్రయత్నం ఏమీా లేకుండా మనస్సు సంఘపు సంప్రదాయాలకు బానిస అయిపోతుంది. సంఘం అంగీకరించిన కొడుకును చూసి సంతోషపడుతుంది. సంఘం హర్షించని కూతురుకోసం కన్నీరు కార్చడానికే భయపడుతుంది! 'మనది'అని చెప్పుకునే మనస్సు ఈ విధంగా సంఘానికి అంకితమైన కారణంచేత 'పరకీయ' కాలేదా మరి!

(రచనాకాలం: ఊహల్ని సాహిత్యానికి అనువదించడం మాత్రం అలవర్చుకొన్న గొంగళీపురుగు దశ.)

---

(జయశ్రీ సంక్రాంతి ప్రత్యేక సంచికనుంచి, జనవరి - 1967)